సాక్షి కర్నూలు

గురువారం । 7 । డిసెంబర్ । 2023



సాక్షి గణపతికి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థం బుధవారం సాక్షి గణపతికి, జ్వాలా వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు.



కల్యాణం..కమనీయం

తిరుమల–తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం జూపాడుబంగ్లా మండలం పారుమంచాలలో సీతారాముల వారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. 8లో▸



బయల్పడిన ముఖమండపం

కొత్తపల్లి: శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం తగ్గడంతో సంగమేశ్వరాలయంలోని ముఖమండపం బుధవారం పూర్తిగా బయల్పడింది. దేవతా మూర్తులకు కార్తీక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

మిచాంగ్‌తో జల్లులే!

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల వర్షాలు నామమాత్రానికే పరిమితం అయ్యాయి. మంగళ, బుధవారాల్లో తేలికపాటి వర్షాలు మాత్రమే కురిశాయి. ఈ నెల 5న ఆరు మండలాల్లో తేలికపాటి వర్షం కురవగా.. జిల్లా మొత్తం సగటున 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది. బుధవారం 5 మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. ఓర్వకల్‌లో 6.4 మి.మీ, కర్నూలు అర్బన్‌లో 4.8, కర్నూలు రూరల్‌లో 4.2, కల్లూరులో 3.8, ఆదోనిలో 0.6 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తం మీద సగటున 0.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

స్కూళ్ల నిర్వహణకు రూ.16.58 కోట్లు

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు సంబంధించి రూ.16.58 కోట్ల నిధులు స్కూల్ పేరెంట్స్ కమిటీల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ డాక్టర్ కే వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ మెటీరియల్‌గా సరఫరా చేయని పనులకు మాత్రమే ఈ నిధులను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. టాయిలెట్ల మరమ్మతులు, క్లాస్ రూం సివిల్ రిపేర్లు.. సాధారణ పరిశుభ్రత పనులు ఈ నెల 21వ తేదీలోపు చేయించాలని తెలిపారు.

వచ్చే ఏడాది కార్మికుల సెలవులు ఇవే..

కర్నూలు(రాజ్‌విహార్): వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు 2024లో ప్రభుత్వం సెలవులు మంజూరు చేసిందని కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఎం. బాలు నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు జనవరి 16న కనుమ, 26న గణతంత్ర దినోత్సవం, ఏప్రిల్ 11న రంజాన్, మే 1న కార్మిక దినోత్సవం, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం, అక్టోబరు 2న గాంధీ జయంతి, 12న విజయదశమి, డిసెంబరు 25న క్రిస్మస్, దుకాణాల్లో పనిచేస్తున్న కార్మికులకు వీటితో పాటు అదనంగా నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సెలవు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. వీటిని తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో ప్రభుత్వ చర్యలు ఉంటాయని ఆయా సంస్థల యజమానులను హెచ్చరించారు.

ఎస్సీ మహిళలకు నేడు ఆటోల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ఎస్సీ మహిళల ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ఉన్నతి పథకం కింద గురువారం ఆటోలు పంపిణీ చేస్తున్నట్లు డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొమ్మిది బజాజ్ కంపెనీ, రెండు అప్పీ కంపెనీకి చెందిన ఆటోలను కల్లూరు మండలంలో ఐదుగురు, కర్నూలు మండలంలో ఇద్దరు, ఆలూరు, కోడుమూరు, సి.బెళగల్, గోనెగండ్ల మండలాల్లో ఒక్కొక్కరికి అందజేస్తున్నట్లు తెలిపారు. ఆటోల పూర్తి ధర రూ.32,58,078 ఉండగా మహిళలు 10 శాతం మొత్తం రూ.3,48,018 భరిస్తుండగా, రూ.29,10,060 ఉన్నతి పథకం కింద రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసే కార్యక్రమంలో 11 మంది మహిళలకు జిల్లా కలెక్టర్ సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య ద్వారా ఆటోలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.



నగదు రహిత లావాదేవీలపై పొదుపు మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నగదు రహితం.. చెల్లింపులు భద్రం

అక్రమాల నివారణకు పేటీఎం ద్వారా రికవరీలు

- అక్టోబర్ 20 నుంచి కొనసాగుతున్న కొత్త విధానం
- రెండు నెలల్లో రూ.1.65 కోట్ల నగదు రహిత రికవరీ
- గతంలో పలుచోట్ల వైకేపీ సిబ్బంది స్వాహాపర్వం
- అక్రమాల కారణంగా పలు మండలాల్లో పెరిగిన ఎన్‌పీఏ
- డిజిటల్ పేమెంట్‌లతో పెరుగుతున్న రికవరీలు

కర్నూలు(అగ్రికల్చర్): మహిళల జీవనోపాధుల అభివృద్ధిలో స్త్రీనిధి కీలక పాత్ర పోషిస్తోంది. స్త్రీనిధి క్రెడిట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ ద్వారా రుణాలు పొందిన మహిళలు వందలాది మంది పేదరికం నుంచి గట్టెక్కారు. అయితే స్త్రీనిధి కింద తీసుకున్న రుణాలను రికవరీ చేస్తున్నప్పటికీ కొంతమంది సిబ్బంది చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ కారణంగా నిరర్ధక ఆస్తులు(ఎన్‌పీఏ) పెరిగిపోతున్నాయి. కొన్ని మండలాల్లో కొత్త రుణాల పంపిణీకి కూడా అవకాశం లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో స్త్రీనిధిలో అక్రమాలను సమూలంగా అరికట్టి మహిళలు చెల్లించే ప్రతి రూపాయి నేరుగా స్త్రీనిధి ఖాతాకు చేరేలా నగదు రహిత లావాదేవీలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుండటం విశేషం. అందులో భాగంగా సెర్ప్ ఇప్పటికే పేటీఎం మిషన్లను కూడా సరఫరా చేసింది.

పలు మండలాల్లో సిబ్బంది చేతివాటం

జిల్లా నుంచి వలసలు ఎక్కువగా ఉంటుండటంతో స్త్రీ నిధి కింద తక్కువ వడ్డీతో రుణసదుపాయం కల్పించి వివిధ వృత్తుల్లో రాణించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే స్వయం సహాయక సంఘాల మహిళలు స్త్రీనిధి నుంచి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించే క్రమంలో కొందరు సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారు. రికవరీ మొత్తాన్ని మహిళలు ప్రతి నెలా గ్రామైఖ్య సంఘానికి నగదు రూపంలో చెల్లిస్తున్నారు. ఈ మొత్తాన్ని గ్రామైఖ్య సంఘం ఖాతాలో వేసుకొని దాని నుంచి స్త్రీ నిధి ఖాతాకు బదిలీ చేస్తున్నారు. అయితే మహిళలు రికవరీ చేసిన మొత్తం స్త్రీ నిధి ఖాతాకు చేరడం లేదు. రికవరీ చేసిన మొత్తంలో కొంతమంది స్వాహా చేస్తున్నారు. మంత్రాలయం, ఆదోని, క్రిష్ణగిరి,



పేటీఎం ద్వారా నగదు స్త్రీనిధి ఖాతాకు జమ చేస్తున్న దృశ్యం

దేవనకొండ, తుగ్గలి, కౌతాళం మండలాల్లో స్త్రీనిధి బకాయిలు పేరుకుపోయాయి. ఒక మండలంలో బకాయి రూ.20 లక్షలు మించితే.. ఆ మండలానికి లోనింగ్ నిలిపివేస్తారు.

అక్రమాల నిరోధించేందుకే నగదు రహిత లావాదేవీలు

స్త్రీనిధి చెల్లింపుల్లో అక్రమాలను నిరోధించేందుకు ప్రభుత్వం నగదు రహిత లావాదేవీలకు శ్రీకారం చుట్టింది. డీఆర్‌డీఏ–వైకేపీకి సంబంధించి ఐదు క్లస్టర్లు ఉన్నాయి. మొదటి విడతలో ప్రతి క్లస్టరులో రెండేసి మండలాల్లో డిజిటల్ చెల్లింపులు చేపట్టారు. ఇందుకు 20 వరకు పేటిఎం మిషన్‌లు వచ్చాయి. ఈ దిశగా డీఆర్‌డీఏ–వైకేపీ సిబ్బంది మహిళలకు నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్నారు. కొత్త విధానం గత అక్టోబర్ 20 నుంచి అందుబాటులోకి వచ్చింది. అక్టోబర్ నెలలో రూ.35 లక్షలు, నవంబర్‌లో రూ.1.18 కోట్లు, డిసెంబర్ నెలలో 6వ తేదీ వరకు రూ.12 లక్షలు పేటిఎం మిషన్‌ల ద్వారా రికవరీ చేశారు. పేటిఎం మిషన్‌లో క్యూర్ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫోన్‌పే, గూగుల్ పే చేయవచ్చు. డెడిట్‌కార్డు, క్రెడిట్ కార్డులను స్వైపింగ్ చేసి రికవరీ చేయవచ్చు. పేటిఎం ద్వారా నేరుగా స్త్రీనిధి ఖాతాకు నగదు జమ అవుతోంది.

ఇక నేరుగా వ్యక్తిగత ఖాతాలకే రుణం

స్త్రీనిధి నుంచి తీసుకునే వ్యక్తిగత రుణాలను కూడా నేరుగా పొదుపు మహిళల వ్యక్తిగత ఖాతాలకే జమ చేయనున్నారు. స్వయం సహాయక సంఘాల్లో పది మంది మహిళలు ఉంటారు. గ్రూపు మొత్తానికి రూ.5 లక్షల వరకు, వ్యక్తిగతంగా అయితే రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు తక్కువ వడ్డీతో రుణం పొందవచ్చు. స్త్రీనిధి నుంచి వ్యక్తిగతంగా తీసుకునే రుణం మొత్తం ఇప్పటి వరకు గ్రూపు ఖాతాకు జమ అవుతుంది. గ్రూపు లీడర్లు బ్యాంకు నుంచి డ్రా చేసి ఇవ్వాల్సి ఉంది. ఇందులోనూ అక్రమాలకు అవకాశం ఏర్పడింది. బ్యాంకు నుంచి డ్రా చేసి ఇవ్వడంలో కూడా ముడుపులు ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిని నివారించేందుకే వ్యక్తిగత రుణాలను నేరుగా వ్యక్తిగత ఖాతాలకే జమ చేయడానికి సెర్ప్ రంగం సిద్ధం చేసింది. ఇందువల్ల రుణాల మంజూరులో కూడా పారదర్శకత పెరుగుతోంది.

పేటీఎం ద్వారానే రికవరీలు



పొదుపు మహిళలు గ్రామ సంఘానికి నగదు రూపంలో చెల్లించిన మొత్తం కొన్ని ప్రాంతాల్లో స్త్రీ నిధి ఖాతాకు జమ కావడం లేదు. ఈ నేపథ్యంలో సెర్ప్ నగదు రహిత లావాదేవీలను ప్రవేశ పెట్టింది. ఇప్పటి వరకు నగదు రహితంగా రూ.1.65 కోట్లు నేరుగా స్త్రీనిధి ఖాతాకు జమ అయింది.

– సలీమ్‌బాషా, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ–వైకేపీ

రూ.357 కోట్ల రుణాలు

స్త్రీనిధి క్రెడిట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ ద్వారా పొదుపు మహిళల జీవనోపాధుల అభివృద్ధికి 2019–20 నుంచి రుణాల పంపిణీని ముమ్మరం చేశారు. ఇప్పటి వరకు రూ.357.85 కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు స్పష్టమవుతోంది. ఐదారు మండలాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో రికవరీ బాగా ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు ఐదేళ్లలో 76,709 మంది మహిళలు ఈ రుణాలతో పలు వృత్తులను అభివృద్ధి చేసుకున్నారు.

100 శాతం పింఛన్ల పంపిణీకి కసరత్తు



పింఛన్లపై ఆరా తీస్తున్న డీఆర్‌డీఏ సిబ్బంది

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 100 శాతం పింఛన్ల పంపిణీకి డీఆర్‌డీఏ–వైకేపీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. డిసెంబరు నెలకు సంబంధించి కర్నూలు జిల్లాలో 2,45,320 మందికి గాను 2,43,332 మందికి (99.19 శాతం), నంద్యాల జిల్లాలో 2,21,508 మందికి గాను 2,20,103 మంది (99.37శాతం) పింఛన్లు తీసుకున్నారు. ప్రతి నెలా 5వ తేదీ వరకు పింఛన్ తీసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. గ్రామ, వార్డు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తున్నా వంద శాతం కావడం లేదు. ప్రతి నెలా 1000 నుంచి 2,000 మంది వరకు పింఛన్లు తీసుకోవడం లేదు. ఇందుకు గల కారణాలను గ్రామ, వార్డు సచివాలయాల వారీగా వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా తెలుసుకుంటున్నారు. ఈ సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదించనున్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈనెల 7న ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసర రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వుల మేరకు ఏడు స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటలకు గ్రామీణాభివృద్ధి, 11 గంటలకు వ్యవసాయం, 12 గంటలకు సాంఘిక సంక్షేమం, 1 గంటకు విద్య, వైద్యం, 2.30 గంటలకు మహిళా అభివృద్ధి శిశు సంక్షేమం, 3.30 గంటలకు ఆర్థిక, ప్రణాళిక పను లు అంశాలపై సమీక్ష కొనసాగుతుందన్నారు. సమావేశాలకు స్థాయీ సంఘ చైర్‌పర్సన్లు, సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు వారి శాఖలకు కేటాయించిన నిర్ణీత సమయానికి హాజరుకావాలని సీఈఓ కోరారు.

పెద్దాసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాల ప్రారంభం



వైద్యపరికరాలను ప్రారంభిస్తున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన అత్యాధునిక వైద్యపరికరాలను బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి ప్రారంభించారు. ఇందులో ఇన్‌బిల్ట్ మల్టీమోడ్ వెంటిలేటర్, మాన్యువల్ అనెస్తీషియా బోయాల్స్ ఆపరేటర్ వర్క్ స్టేషన్(3 బీపీఎల్) ఉన్నాయి. వీటిని ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లలో ఉంచారు. ఈ సందర్భంగా డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రి సర్జికల్ థియేటర్ ఏబీ ఓటీలో ఈ మిషన్ వల్ల రోగికి ఆటోమేటిక్ ఆక్సిజన్ సరఫరా, శ్వాస తీసుకోవడంలో నిమిషానికి ఆక్సిజన్ సరఫరా ఎంత కావాలో ఆటోమేటిక్‌గా జనరేట్ చేయనున్నట్లు తెలిపారు. ఇన్‌బిల్ట్ మల్టీ మోడ్ వెంటిలేటర్, మాన్యువల్ వెంటిలేటర్, అనెస్తీషియా వర్క్ స్టేషన్‌తో మూత్రనాళాలకు సంబంధించిన సర్జరీల్లో అనెస్తీషియా ఇవ్వడానికి ఈ పరికరం చాలా దోహదపడుతుందన్నారు. ఇలాంటి వైద్యపరికరాలు కార్పొరేట్ సెక్టార్‌లో కూడా చాలా అరుదుగా ఉంటాయన్నారు. అలాంటి పరికరాలు ఇప్పుడు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేయడం ద్వారా క్లిష్టమైన సర్జరీలైన న్యూరో సర్జరీ, బైపాస్ సర్జరీ చేయడానికి, రోగులకు మత్తు మందు ఇచ్చేందుకు దోహదపడుతుందన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శస్త్రచికిత్సలు చేయడానికి వీలు అవుతుందని అనెస్తీషియా, సర్జరీ వైద్యులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హేమనళిని, అనెస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ విశాల, ప్రొఫెసర్ డాక్టర్ కొండారెడ్డి, డాక్టర్ సుధీర్; ఆర్‌ఎంవో డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్టేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్ పాల్గొన్నారు.

సంక్షేమ బావుటా




చదువులకయ్యే ఖర్చు తగ్గింది



నేను, నాభర్త రాజు కూలి పనులు చేసుకుని జీవనం చేస్తున్నాం. మాకు ఇద్దరు పిల్లలు. వారిని ప్రైవేట్ బడుల్లో చదివించే స్తోమత లేదు. ఇద్దరిని ప్రభుత్వ బడిలో చదివిస్తున్నాం. గతంలో పుస్తకాలకు, బ్యాగులకు రూ. 3,000 నుంచి రూ. 4,000 వరకు ఖర్చు వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత చదువులకయ్యే ఖర్చు తగ్గింది. విద్యా కానుక కింద ఉచితంగా పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం, టై, బెల్టు ఇస్తున్నారు. అమ్మఒడి పథకం ద్వారా మాకు ఏటా రూ.15000 అందుతోంది. పాఠశాలలో మధ్యాహ్నం రుచికరమైన భోజనం పెడుతున్నారు. ప్రైవేట్ స్కూళ్ల మాదిరి ఇంగ్లిషు పాఠాలు చెబుతున్నారు. పిల్లల చదువుల బాధ్యత ప్రభుత్వమే తీసుకున్నందుకు మాకు చాలా సంతోషంగా ఉంది.

– లక్ష్మి, క్రాంతినగర్, ఆదోని

ఇంటికి వచ్చి వైద్య పరీక్షలు చేస్తున్నారు



నాకు 62 ఏళ్లు. గతంలో జ్వరమొస్తే ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లేవాళ్లం. ప్రభుత్వ ఆసుపత్రులు సరిగ్గా పనిచేసేవి కాదు. జబ్బు తగ్గేది కాదు. డబ్బు ఎక్కువగా ఖర్చయ్యేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత చాలా మార్పు వచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపడ్డాయి. పెద్ద డాక్టర్లు రోగులను బాగా చూస్తున్నారు. జబ్బులు నయం అవుతున్నాయి. మా సచివాలయంలో ఇటీవల హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. నాకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు. ప్రతి నెలా రెండు సార్లు 104 వాహనం మా వీధికి వస్తుంది. వైద్య సిబ్బంది షుగర్, బీపీ వంటి పరీక్షలు చేస్తున్నారు. నెలకు సరిపడే మందులు ఉచితంగా ఇస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు సైతం ఇంటి వద్దనే వైద్య పరీక్షలు చేస్తున్నారు. గతంలో ఇంటి వద్దకే వచ్చి ఇలాంటి వైద్యం అందించడం ఎప్పుడూ చూడలేదు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– ఫక్కీరప్ప, ఆలూరు

నకిలీ ఓట్లపై ప్రత్యేక దృష్టి

- జీఎల్వోలను ఆదేశించిన జెడ్పీ సీఈఓ



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: ఓటరు జాబితాలో నకిలీ ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించి, తొలగించాలని బూత్ లెవల్ ఆఫీసర్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. చనిపోయిన వారి పేర్లు ఉన్నా, రెండు చోట్ల జాబితాలో పేర్లు ఉన్నా.. పరిశీలించి, వాటిని తొలగించాలన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా రంగయ్య, రియాజ్, సునీల్‌కుమార్, తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, సీపీఎం నాయకుడు రాముడు, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, తహసీల్దార్లు ఆంజనేయులు, వేణుగోపాల్ శర్మ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు గురురాజావు, రఘువీర పాల్గొన్నారు.

రూ.11.63 కోట్ల జీజీఎంపీ నిధులు విడుదల

కర్నూలు (టౌన్): జీజీఎంపీ (గడప గడపకు మన ప్రభుత్వం) కార్యక్రమంలో భాగంగా కర్నూలులో వివిధ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.11.63 కోట్ల నిధులను విడుదల చేసింది. ఆయా పనులకు బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పరిపాలనా అనుమతులు జారీ చేశారు. నగరపాలక సంస్థ పరిధిలో కర్నూలు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, జరదొడ్డి సుధాకర్ ప్రతి రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సచివాలయాల పరిధిలో పర్యటించి, ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు ఇంజినీరింగ్ అధికారుల ద్వారా అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. నివేదిక అందిన వెంటనే ప్రభుత్వం స్పందించి నిధులను విడుదల చేస్తోంది. జీజీఎంపీ నిధులతో ఇప్పటికే రూ.34 కోట్ల పనులను పూర్తి చేసి కాంట్రాక్టర్లకు బిల్లులు సైతం చెల్లించారు. ప్రస్తుతం 147 అభివృద్ధి పనులకు రూ.11.63 కోట్లు వచ్చాయి. ఈ నిధులతో అన్ని సచివాలయాల పరిధిలో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల పనులు చేపట్టనున్నట్లు మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్ హుస్సేన్ తెలిపారు.

ప్రతి మండలంలో డీసీఎంఎస్ బ్రాంచ్



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి మండలంలో డీసీఎంఎస్ బ్రాంచ్‌లను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నామని చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి మద్దయ్య తెలిపారు. బుధవారం కర్నూలులోని డీసీఎంఎస్ కార్యాలయంలో బోర్డు సమావేశం నిర్వహించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీసీఎంఎస్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ..ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 18 బ్రాంచీలు ఉన్నాయని, ప్రతి మండలంలో బ్రాంచ్ ఏర్పాటు చేసేందుకు 15 సెంట్ల భూమిని కేటాయించే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారన్నారు. ఇప్పటికే పలు మండలాల్లో స్థలాలను రెవెన్యూ అధికారులు కేటాయించారని పేర్కొన్నారు. వచ్చే ఖరీఫ్ నుంచి డీసీఎంఎస్‌ల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్లు దేవభూషణం, బడేసాహెబ్, రామకృష్ణ, వినయ్‌కుమార్‌రెడ్డి, బిజినెస్ మేనేజర్ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు అభినందనీయం

- ఎస్పీ కృష్ణకాంత్



పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన హోంగార్డు కుమార్తె ముస్కాన్‌కు నగదు రివార్డు అందజేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్, చిత్రంలో పోలీస్ అధికారులు

కర్నూలు: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులతో సమానంగా హోంగార్డులు సేవలు అందించడం అభినందనీయమని ఎస్పీ కృష్ణకాంత్ అన్నారు. హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీకాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ మాట్లాడుతూ.. దేవరగట్టు బన్ని ఉత్సవం, ఆదోని, కర్నూలులో వినాయక చవితి వేడుకల్లో హోంగార్డులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని ప్రశంసించారు. వచ్చే ఎన్నికల్లో కూడా బాగా పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో సమస్యలు ఏవైనా ఉంటే వాటిని వాట్సప్ నెంబర్‌కు పంపితే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. హోంగార్డ్స్ సదరన్ రీజియన్ కమాండెంట్ మహేష్ కుమార్ మాట్లాడుతూ.. 1963లో ఆవిర్భవించిన హోంగార్డ్స్ వ్యవస్థ పోలీసు శాఖలో కీలకంగా మారిందన్నారు. ఇతర డిపార్ట్‌మెంట్లలో కూడా హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నగదు రివార్డుల ప్రదానం

ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంటెక్‌లలో మంచి మార్కులు సాధించిన 34 మంది హోంగార్డుల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్ కింద రూ.85 వేల నగదు రివార్డులు అందజేశారు. స్పోర్ట్స్‌లో గెలుపొందిన హోంగార్డు సిబ్బందికి కూడా ఎస్పీ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. విధుల్లో ప్రతిభ కనబరచిన 20 మంది హోంగార్డులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. హోంగార్డ్ రాజశేఖర్ 2022 జూన్‌లో మృతి చెందగా.. ఈయన భార్య వై.మల్లీశ్వరికి, హోంగార్డు మల్లికార్జున 2023 సెప్టెంబర్‌లో మృతిచెందగా.. ఈయన భార్య టి.హేమలతకు హోంగార్డు నియామక పత్రాలను అందజేశారు.

బాధిత కుటుంబాలకు కాంట్రిబ్యూషన్ ఫండ్..

అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు మల్లికార్జున భార్య హేమలతకు హోంగార్డు కాంట్రిబ్యూషన్ ఫండ్ కింద రూ.2 లక్షలు, ఫ్లాగ్ ఫండ్ కింద రూ.10 వేలు, వెంకటేశ్వర్లు భార్య దేవికి కాంట్రిబ్యూషన్ ఫండ్ కింద రూ.2 లక్షలు, ఫ్లాగ్ ఫండ్ కింద రూ.10 వేలు అందజేశారు. హోంగార్డు మహబూబ్ సుబాని పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనను శాలువ, పూలమాలలతో ఎస్పీ సత్కరించారు. హోంగార్డులు అందరూ కలసి స్వచ్ఛందంగా జీతాల నుంచి పోగు చేసి సేకరించిన రూ.2 లక్షలు ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. హోంగార్డ్స్ శామ్యుల్, చంద్రపాల్‌లు ఈ సందర్భంగా పాటలు, పద్యాలు పాడి అందరినీ అలరించారు. ఎస్పీ వారిని ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు. అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, అడ్మిన్ అడిషనల్ ఎస్పీ టి.సర్కార్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగబాబు, హోంగార్డ్స్ డీఎస్పీ కృష్ణమోహన్, ఆర్ఐలు రమణ, రవికుమార్, పోతల రాజు, శివారెడ్డి, ఆర్ఎస్ఐలు, పోలీసులు, హోంగార్డు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్వారీల్లో అక్రమ తవ్వకాలు



తడకనపల్లెలో లీజు కంటే ఎక్కువ తవ్విన దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): నిబంధనలకు విరుద్ధంగా క్వారీల్లో అక్రమ తవ్వకాలు జరుపుతున్నట్లు తనిఖీల్లో తేలిందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం కల్లూరు మండల పరిధిలోని తడకనపల్లె, చెట్లమల్లాపురంలోని రెండు మెటల్ క్వారీలను తనిఖీ చేశామన్నారు. లీజు ఇచ్చిన దానికంటే ఎక్కువ మొత్తంలో మెటల్ తవ్వినట్లు తనిఖీల్లో తేలిందన్నారు. అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసి, రూ.21వేలు జరిమానా విధించి, వసూలు చేసినట్లు ఆయన తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య


మృతి చెందిన మహబూబ్‌పీరా

కొలిమిగుండ్ల: చదువుకు తగ్గ ఉద్యోగం రాలేదని, కుటుంబంలో నెలకొన్న ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. కల్వటాలకు చెందిన మహ్మద్ హనీఫ్‌కు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. పెద్దకుమారుడు మహబూబ్‌పీరా(31) బీటెక్ పూర్తి చేసి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. సోదరి పెళ్లి ఉండటంతో నెల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఉన్న ఎకరన్నర పొలంలో పంటలు సరిగా పండకపోవడం, చదువుకు తగ్గ ఉద్యోగం రాకపోవడంతో కుటుంబ అభివృద్ధికి ఏమీ చేయలేకపోతున్నానని వేదన చెందేవాడు. ఈక్రమంలో ఉదయం పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండగా కుటుంబ సభ్యులు గమనించి అనంతపురం జిల్లా తాడిపత్రి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్‌రెడ్డి తెలిపారు.

పాతకక్షలతో వ్యక్తిపై దాడి

జూపాడుబంగ్లా: పాత కక్షలను మనసులో పెట్టుకొని వ్యక్తిపై దాడి చేసిన ఘటన మండలంలోని తర్తూరు గ్రామంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్‌ఐ మారుతీశంకర్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కుర్వ పెద్దస్వాములు, కుర్వ జనార్దన్ అలియాస్ జన్ను మంగళవారం రాత్రి గ్రామ సమీపంలోని కల్లంలో మద్యం తాగారు. ఈక్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరగటంతో పాటు పాతకక్షలను గుర్తుచేసుకుని కుర్వ జనార్దన్ బండి గూటంతో కుర్వ పెద్దస్వాములు తలపై కొట్టాడు. తల పగిలి తీవ్ర రక్తగాయాలు కావటంతో అక్కడికక్కడే స్పృహతప్పి పడిపోయాడు. అక్కడి నుంచి జనార్దన్ వెళ్లిపోయాడు. తెల్లవారుజామున స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు అక్కడికి చేరుకుని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని బాధితుని తండ్రి కేశవులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో రైతు కూలీ మృతి


కురువ బాలన్న (ఫైల్)

మిడుతూరు: మండల పరిధిలోని వీపనగండ్ల గ్రామానికి చెందిన రైతు కూలీ కురువ బాలన్న(51) బుధవారం విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఏఎస్‌ఐ సుబ్బయ్య తెలిపిన వివరాలు.. కురువ బాలన్నకు పొలం లేకపోవడంతో ఎద్దులు పెట్టుకొని బాడుగలకు వెళ్తూ జీవనం సాగించేవాడు. ఈక్రమంలో పొగాకు తోరణాలు తోలేందుకు అదే గ్రామానికి చెందిన రాముడు పొలానికి బాడుగకు వెళ్లాడు. పొలంలో పొగాకు తోరణాలు బండికి లోడ్ చేసుకుంటుండగా డిష్ వైర్ అడ్డు ఉండటంతో పక్కకు తీయడానికి చేయితో పక్కకు నెట్టాడు. డిష్ వైర్ పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. మృతుడికి భార్య సువర్ణమ్మ, కుమారుడు ఐకుమార్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు వివాహమైంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఆనందమానందమాయె!

- కేజీబీవీ పార్ట్‌టైం పీజీటీలకు వేతనాలు పెంచిన ప్రభుత్వం
- రూ.12 వేల నుంచి రూ 26,759కి పెరిగిన వేతనం
- నూతన సంవత్సర కానుకగా అందుకోనున్న వైనం
- ఉమ్మడి జిల్లాలో 51 మందికి లబ్ధి
- జూన్‌లోనే ప్రిన్సిపాల్స్, సీఆర్టీలకు, పీఈటీలకు పెరిగిన వేతనాలు


కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం

ఆళ్లగడ్డ: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయల్లో పార్ట్‌టైం పీజీటీ (గెస్ట్ లెక్చలర్)లుగా విధులు నిర్వహిస్తున్న వారికి ప్రభుత్వం తీపికబురు అందించింది. ఇంటర్మీడియట్‌తో పాటు అవసరమైతే 8నుంచి 10వ తరగతి వరకు ప్రత్యేకంగా సబ్జెక్ట్ బోధిస్తున్నప్పటికీ జీతాలు పెరుగుదల లేక నిరాశగా ఉన్న వీరి ఆనందం ఒక్కసారిగా రెట్టింపు అయ్యింది. వీరి వినతులు స్వీకరించిన ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఏకంగా ఒకేసారి రెండింతలకు పైగానే వేతనాలను పెంచేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో పార్ట్‌టైం పీజీటీల్లో ఆనందం రెట్టింపు అయ్యింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 53 కేజీబీవీల్లో 51 మంది మహిళా అధ్యాపకులు పార్ట్‌టైం పీజీటీలుగా పని చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బడి మానేసిన, అనాథ పిల్లల్లు, బడిబయట పిల్లలకు చదువునందించాలనే లక్ష్యంతో 2007లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలకు ఘనమైన పునాది వేశారు. ఆయన బాటలోనే తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో ముందడుగు చేశారు. పదోతరగతి వరకు ఉన్న కస్తూర్బాగాంధీ బాలికా విద్యాయాల్లో ఇంటర్మీడియెట్ విద్యను ప్రవేశపెట్టి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారు. ఇదే క్రమంలో బోధనావసరాల కోసం అర్హత కలిగిన సీనియర్ ఉపాధ్యాయులకు అధ్యాపకులుగా పదోన్నతి కల్పిండంతో పాటు పార్ట్‌టైం పీజీటీలు (ఒప్పంద అధ్యాపకులు)లను నియమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉమ్మడి జిల్లాలో 51 మంది మహిళా అధ్యాపకులు పార్ట్‌టైం పీజీటీలుగా రూ. 12 వేల వేతనంతో పనిచేసేలా ఒప్పందం చేసుకుని విధుల్లో చేరారు. అయితే రూ. 12వేల వేతనం నుంచి ఒకే సారి రూ. 14,759 మేర పెంచి రూ. 26,750 అందించేలా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పెరిగిన వేతనం ఈ నెల (డిసెంబర్) నుంచే అందించేలా గజిట్ నోటిఫికేషన్ కూడా విడుదలైంది. ఆశించిన స్థాయి కంటే వేతనాలు పెంచడంతో పీజీటీలుగా విధులు నిర్వహిస్తున్న మహిళా అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేజీబీవీ సిబ్బంది వేతనాల వివరాలు

కేడర్	గతంలో (రూ.ల్లో)	ప్రస్తుతం (రూ.ల్లో)
ప్రిన్సిపాల్	27,755	34,139
పీజీటీ	12,000	26,759
సీఆర్టీ	21,759	26,759
పీఈటీ	21,755	26,755
పార్ట్‌టైం పీజీటీ	12,000	26,759 (డిసెంబర్ నుంచి)

5 నెలల క్రితమే పెరిగిన వేతనాలు..

కేజీబీవీల్లో ఏళ్ల తరబడి పనిచేసున్న పీజీటీలకు తప్ప మిగతా ప్రిన్సిపాళ్లు, సీఆర్టీలు, పీఈటీలు, ఇతర సిబ్బందికి అందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేతనాలు పెంచింది. ఇందులో ప్రిన్సిపాళ్లకు రూ. 27,755 ఉన్న వేతనాన్ని రూ 34,139 పెంచారు. అలాగే సీఆర్టీలకు రూ. 21, 755 నుంచి రూ.26,759, పీఈటీలకు రూ. 21,755 నుంచి రూ.26,759లకు పెంచారు. అలాగా తాజాగా ఇప్పుడు పార్ట్‌టైం పీజీటీలకు కూడా రూ.12 వేల నుంచి ఒకే సారి రూ. 26,759 పెంచడం జరిగింది.

కేజీబీవీల్లో కొలువుల జాతర

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత రెండు నెలల క్రితం ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్, పీజీటీ పోస్టులను విద్యాశాఖ భర్తీ చేసింది. ఇందులో 53 విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 15 ప్రిన్సిపాల్, 52 సీఆర్టీ, 130 పీజీటీ, 5 పీఈటీ మొత్తం 202 పోస్టులను కాంట్రాక్ట్ విధానంలో భర్తీ చేశారు. కాగా ప్రస్తుతం ఖాళీగా ఉన్న 14 పీజీటీలు, 3 ప్రిన్సిపాల్ పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఇటీవల ఉద్యోగాల ఎంపిక ప్రక్రియలో భాగంగా తయారు చేసిన మెరిట్ లిస్ట్‌లో ఉన్న అవకాశం లభించని వారికి అవకాశం కల్పించనున్నారు. కౌన్సెలింగ్ ద్వారా ఆయా ప్రక్రియను పూర్తి చేసి ఈ నెల 15వ తేదీలోపు ఎంపికైన వారు విధుల్లో చేరేలా చర్యలు తీసుకుంటున్నారు.

సీఎంకు రుణపడి ఉంటాం



చాలా కాలం నుంచి రూ.12 వేల జీతంతోనే విధులు నిర్వహిస్తున్నాను. మా వేతనాలు పెంచడంతో పాటు పార్ట్‌టైం అనే పదం తీసి పీజీటీ అని పెట్టాలని అనేక మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. స్పందించిన ప్రభుత్వం అందరితో సమానంగా మాకు కూడా రూ. 26,759 వేతనం పెంచడం చాలా సంతోషంగా ఉంది. అలాగే మమ్మలను పార్ట్‌టైం అనకుండా పీజీటీలుగా గుర్తించేలా జగన్న నిర్ణయం తీసుకుంటే జీవితాంతం రుణపడి ఉంటాం.

– షాహీన్ బెనజీర్, ఫిజిక్స్ లెక్చరర్ (పార్ట్‌టైం పీజీటీ), కేజీబీవీ, చాగలమర్రి

చెప్పలేని సంతోషం..



రూ. 12వేల వేతనంలో రోజు స్కూల్‌కు వచ్చేపోయే చార్జీలకే సగం పోయేది. మిగిలిన వేతనంతో కుటుంబం జరుపుకోవడం చాలా ఇబ్బందిగా ఉండేది. మా బాధలు గమనించిన సీం మేము ఊహించుకున్న దానికన్నా రెట్టింపు జీతం పెంచడంతో చెప్పలేని సంతోషంగా ఉంది. ప్రస్తుతం నా వేతనం రూ. 26,759 పెంచుతూ జీవో జారీ చేయడంతో చెప్పలేని సంతోషం నెలకొంది.

– రామసుబ్బమ్మ, మాథ్స్ లెక్చరర్ (పార్ట్‌టైం పీజీటీ) కేజీబీవీ, పుచ్చకాయలపల్లె

శుభ పరిణామం



కేజీబీవీల్లో విద్యా ప్రమాణాలు పెరిగేలా ప్రభుత్వం పోస్టులను భర్తీ చేసింది. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న పార్ట్‌టైం పీజీటీలకు జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక్కొక్కరికి ఇప్పుడు వేతం కంటే అదనంగా రూ. 14,759 పెంచుతూ ప్రొసీడింగ్స్ వచ్చాయి. పెరిగిన వేతనం డిసెంబర్ నెల నుంచి వర్తిస్తుంది. జనవరి నెలలో పెరిగిన జీతం రూ. 26,759 చేతికి వస్తుంది.

– సుధాకర్‌రెడ్డి, నంద్యాల జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో – ఆర్డినేటర్

ఆశా కార్యకర్తలకు కొత్త యూనిఫాంలు


ఆశాలకు యూనిఫామ్‌లు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీఐఓడాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ తదితరులు

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జిల్లాలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త యూనిఫామ్‌లను పంపింది. ప్రతి ఒక్క ఆశాకు రెండు చీరలు అందజేస్తారు. వీటిని బుధవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య ఆశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు ఉన్న ఈ–ఆశా యాప్‌ను ప్రతిరోజూ లాగిన్ అవుతూ అందులో అర్హులైన జంట, ఐఎఫ్‌ఏ, విటమిన్–ఎ, హెచ్‌బీఎన్‌సీ, వీహెచ్‌ఎస్‌ఎన్‌సీ, వీహెచ్‌ఎన్‌డీ ఆప్షన్‌లో డేటా సమర్పించాలన్నారు. డీఐఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ హెచ్‌బీఎన్‌సీ విజిట్‌లో ప్రతి బేబికి ఆరు సార్లు, హెచ్‌బీవైసీలో ప్రతి బేబికి ఐదు సార్లు విజిట్ చేయాలని చెప్పారు. విజిట్‌కు వెళ్లినప్పుడు హెచ్‌బీఎన్‌సీ, హెచ్‌బీవైసీ కిట్‌లను తీసుకెళ్లి వాటిని ఉపయోగించి పిల్లల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి తగు జాగ్రత్తలు సూచించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈఈవో శ్రీనివాసులు, డీసీఎం ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ఆశాలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు


రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు


షాట్‌పుట్ విసురుతున్న క్రీడాకారుడు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లాల బాల, బాలికల క్రీడా పోటీలు రెండవ రోజు బుధవారం కొనసాగాయి. అథ్లెటిక్స్ పోటీల్లో 100 మీటర్ల పరుగు విభాగంలో మొదటి స్థానంలో పీవీ సురేంద్రగౌడ్, నవ్యభారతి, 200 మీటర్స్ విభాగంలో సురేంద్రగౌడ్, భావన, 400 మీటర్స్ విభాగంలో శేషాద్రి, లావణ్య రెడ్డి విజయం సాధించారు. 800 మీటర్ల విభాగంలో నాగశ్రీనివాసులు, రూప, లాంగ్ జంప్‌లో నవ్య భారతి, సూరజ్ కుమార్ విజేతలుగా నిలిచారు. డిస్క్ త్రో విభాగంలో సుస్మిత సేన్, శివరామకృష్ణ గెలుపొందారు. బ్యాడ్మింటన్, చెస్ బాలుర విభాగంలో నంద్యాల పాలిటెక్నిక్ కళాశాల క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. ఖోఖో బాలికల విభాగంలో నంద్యాల ఈఎస్‌సీ కళాశాల క్రీడాకారిణులు ఫైనల్స్‌కు చేరుకున్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులను ప్రిన్సిపాల్ శ్రీనివాస ప్రసాద్ అభినందించారు.

మల్లన్నను దర్శించుకున్న జగద్గురు పీఠాధిపతి


స్వామిఅమ్మవార్ల దర్శనార్థం వస్తున్న పీఠాధిపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను జగద్గురు పీఠాధిపతి శ్రీచెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామిజీ బుధవారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు, ఆలయార్చకులు , వేదపండితులు ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో పీఠాధిపతికి దేవస్థానం తరఫున వస్త్ర సమర్పణ చేశారు.

ప్రమాదాలకు తావు లేకుండా బస్సులు నడపండి

కర్నూలు(రాజ్‌విహార్): ప్రమాదాలకు తావు లేకుండా బస్సులు నడపాలని రోడ్డు రవాణా సంస్థ కర్నూలు–2 డిపో మేనేజరు సర్దార్ హుసేన్ అన్నారు. బుధవారం ఆయన గ్యారేజీలో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యాన్ని చేర్చడమే లక్ష్యంగా విధులు నిర్వహించాలన్నారు.

కల్యాణం.. కమనీయం

- అంగరంగవైభవంగా సీతారాములవారి కల్యాణం


అలంకరణలో ఉత్సవమూర్తులు


సీతారాముల వారి కల్యాణ వేడుకల్లో పాల్గొన్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సీతారాముల వారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. తన చెంతకు రాలేని భక్తుల కోసం సీతారాముల వారు ఒంటిమిట్ట నుంచి భక్తుల చెంతకు రావటంతో భక్తులు కనులారా తిలకించి పరవశించిపోయారు. తిరుమల–తిరుపతి దేవస్థానం ఈఓ ధర్మారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సీతారాముల కల్యాణం అంగరంగవైభవంగా జరిగింది. స్వామి, అమ్మ వార్ల విగ్రహాలను పట్టువస్త్రాలతో వధూ, వరులుగా దేదీప్యమానంగా ముస్తాబుచేసి ఉత్సవ పల్లకీలో తెచ్చి కల్యాణ వేదికపై కూర్చొండబెట్టారు. వేదపండితులు మంత్రాలు పఠిస్తుండగా టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, అపర్ణ దంపతులు స్వామి, అమ్మవార్ల కల్యాణ క్రతువును నిర్వహించారు. కల్యాణ వేడుకలకు నందికొట్కూరు, ఆత్మకూరు, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి సుమారు 6 వేల మంది భక్తులు తరలిరావటంతో పరిసరాలు కిక్కిరిసిపోయాయి. స్వామివారి తరఫున అర్చకులు సీతమ్మవారి మెడలో మాంగల్య ధారణ చేసే ఘట్టాన్ని చూసి భక్తులు తన్మయత్వానికిలోనయ్యారు. అనంతరం స్వామివారికి కల్యాణ తలంబ్రాలు చల్లి తమ జన్మ ధన్యమైందంటూ పులకించిపోయారు. భక్తులకు తిరుమల లడ్డూ, ప్రసాదాలను అందజేశారు.


కల్యాణవేడుకలను తిలకించేందుకు తరలివచ్చిన భక్తులు

భక్తిశ్రద్ధలతో ప్రాణప్రతిష్ట వేడుకలు

జూపాడుబంగ్లా మండలంలోని పారుమంచాల గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయస్వామి వారి ఆలయంలో స్వామివార్లకు ప్రాణప్రతిష్ట వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టీటీడీ దేవస్థాన అర్చకులు వేదమంత్రాలను పఠిస్తూ అగ్నిప్రణయనం, కుంభారాధన, మహాపూర్ణాహుతి, మహాకుంభాభిషేకం, మహానివేదన, అక్షతారోహణం, బ్రహ్మఘోష, మహా ఆశీర్వచనం, సర్వదర్శనం తదితర పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, అపర్ణ దంపతులు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు జేసీ నారపురెడ్డి మౌర్య దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కర్నూలు, ఆత్మకూరు, నందికొట్కూరు తదితర ప్రాంతాలకు చెందిన భక్తులతో పాటు గ్రామస్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వెంకటరమణ, తర్తూరు సర్పంచ్ పీఎం నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కర్నూలు జేసీ నారపురెడ్డి మౌర్య దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

కర్నూలు మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	2,905	8,032
పొద్దుతిరుగుడు	3,889	4,439
ఆముదం	4,203	5,256
వాము	10,110	10,110
ఉల్లి	302	3,720
ఎండుమిర్చి	3,599	22,222
శనగలు	5,512	5,712
కందులు	7,419	10,321
మొక్కజొన్న	1,520	1,960
మినుములు	9,339	9,429
కొర్రలు	4,000	4,000
సోయాచిక్కుడు	3,619	3,859

కర్నూలు మార్కెట్ యార్డు ఫోన్ : 08518–257204, 257661

కర్ణాటక మద్యం పట్టివేత


నిందితుల అరెస్ట్‌ను చూపుతున్న సెబ్ అధికారులు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని రత్నపల్లె గ్రామ సమీపంలో బుధవారం కర్నూలు టాస్క్‌ఫోర్స్‌తో కలిసి చేసిన సోదాల్లో.. ఇన్నోవా కారులో అక్రమంగా తరలిస్తున్న 2400 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు (25 బాక్సులు) స్వాధీనం చేసుకున్నట్లు కోడుమూరు సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. నిందితులు కర్నూలుకు చెందిన కురుమూర్తి, రమేశ్‌లను అరెస్ట్ చేశామన్నారు. కారును సీజ్ చేసి కేసు నమోదు చేసుకుని మరో నిందితుడి కోసం గాలింపు చేపట్టామన్నారు. అరెస్ట్ చేసిన నిందితులను డోన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. దాడుల్లో స్వామినాథన్, సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు


పెద్దహోతూరులో అక్రమ లేఅవుట్‌లో రాళ్లను తొలగిస్తున్న కుడా వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి

ఆలూరు రూరల్: అనుమతుల్లేకుండా లేఅవుట్లు వేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి ఆదేశించారు. బుధవారం మండలంలోని పెద్దహోతూరు గ్రామ పంచాయతీలో అనుమతులు లేకుండా 6 ఎకరాల్లో అక్రమంగా వేసిన లే అవుట్‌లోని రోడ్లు, సరిహద్దు రాళ్లను ఆయన సమక్షంలో పంచాయతీ అధికారులు జేసీబీతో తొలగించారు. సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా లే అవుట్లు వేయడం, స్థలాలు కొనడం, విక్రయించడం చట్టరీత్యా నేరం అన్నారు. మండలంలో ఉన్న అక్రమ లేవుట్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడుకు ఆదేశించారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ రమేష్ సిబ్బంది ఉన్నారు.

సొమ్మసిల్లి పడి వ్యక్తి మృతి

కర్నూలు: స్థానిక సి.క్యాంప్ వద్ద టిఫిన్ సెంటర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న చాకలి వీరన్న (30) సొమ్మసిల్లి కింద పడి మృతిచెందాడు. కొతాళం గ్రామానికి చెందిన ఈయన కొంతకాలంగా శ్రీలక్ష్మీ నగర్‌లోని సెయింట్ లూడ్స్ స్కూల్ పక్కన అద్దె ఇంట్లో ఉంటూ టిఫిన్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. యథా ప్రకారం బుధవారం ఉదయం 10 గంటల సమయంలో టిఫిన్ సెంటర్ వద్ద సొమ్మసిల్లి కింద పడిపోగా సమీపంలో ఉన్నవారు గమనించి ఆయన భార్య చాకలి సువర్ణకు సమాచారం అందించారు. ఆమె హుటాహుటిన అక్కడికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న భర్త వీరన్నను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా డ్యూటీ డాక్టర్ పరిశీలించి అప్పటికే అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు ఆమె మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి సంఘటన పూర్వాపరాలపై విచారణ జరుపుతున్నట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు


విద్యార్థినితో మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ వేణుగోపాల్

ఆలూరు రూరల్: ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ వేణుగోపాల్ హెచ్చరించారు. ఆయన బుధవారం ఆలూరులోని కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. రోజువారి ప్రణాళికల్లో భాగంగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌లో ఇచ్చిన అంశాలను తెలియజేసి పరీక్షలకు సిద్ధం చేయాలని చెప్పారు. ఈ–పాఠశాల యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ప్రతి తరగతి గదిలో వైఫై కనెక్షన్ ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ ద్వారా విద్యార్థులకు టోఫెల్ క్లాసులు నిర్వహించాలని చెప్పారు. మరమ్మతులకు గురైన ట్యాబ్‌లను సంబంధిత టెక్నీషియన్‌తో మాట్లాడి పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ సుహాసినికి ఆదేశించారు. జిల్లా బాలికల అభివృద్ధి అధికారిణి సునీత ఉన్నారు. అనంతరం హాలహర్వి కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

షోకాజ్ నోటీసు జారీ

టీచర్లు వంద రోజుల ప్రణాళికపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో విఫలం కావడం, సమయానికి పాఠశాలకు హాజరుకాకపోవడంతో కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ సుహాసిని, జువాలజీ, తెలుగు, హిందీ టీచర్లతో పాటు అకౌంటెంట్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. లోపాలపై ప్రిన్సిపాల్ మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

చిప్పగిరి: అలాగే చిప్పగిరి మండలంలోని కేజీబీవీ పాఠశాలను అధికారి వేణుగోపాల్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనం, ఇతర సదుపాయాలను పరిశీలించారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. జీసీడీఓ సునీత, ఎస్ఓ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.